తెలంగాణ జీవగడ్డ

మంగళవారం 30.09.2026

ఎడిటర్ : మోటపలుకుల వెంకట్ | డిజిటల్ పత్రిక | TELANGANA JEEVAGADDA | సంపుటి : 1 | సంచిక: 175

# సీఈసీ జ్ఞానేశ్ వైదొలగాల్సిందే

### ఒత్తిడిని పెంచుతున్న ప్రతిపక్షాలు

### నేడు ఇండియా కూటమి భేటీ

### 2న ముంబైలో సీజేపీ నిరసనలు

**ముంబై:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) అక్టోబర్ 2న ముంబైలో నిరసన చేపట్టనుంది. ముంబైలోని శివాజీ పార్క్ గేట్ నంబర్ 6 వద్ద సాయంత్రం ఆందోళన నిర్వహించనున్నట్లు మంగళవారం ప్రకటించింది. 'ముంబై చలో.. గద్దార్ జ్ఞాను మస్ట్ గో' అంటూ సీజేపీ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ డిమాండ్‌పై వెనక్కి తగ్గబోమని సీజేపీ సహ కన్వీనర్ అశుతోష్ రాంకా తెలిపారు. ఓటర్ల జాబితాల నుంచి 13 కోట్ల పేర్లు తొలగించారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై జ్ఞానేశ్ కుమార్ మీడియా, ప్రజల ముందు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'సర్' ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేసేందుకు ఇండియా కూటమి అగ్రనేతలు బుధవారం



న్యూఢిల్లీలో సమావేశం కానున్నారు. ప్రధాన ఎన్నికల కమిష నర్(సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, చేపట్టాల్సిన ఆందోళనలపై సమావేశంలో చర్చిం చనున్నారు. అలాగే జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసించాలని లోక్‌సభ, రాజ్యసభల్లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ముసాయిదా నోటీసు సిద్ధంగా ఉందని, బుధవారం సమావేశంలో దానిపై చర్చించి ఆమోదించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు జైరాం రమేష్, కేసీ వేణుగోపాల్, టీఎంసీ నేతలు మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలతో పాటు సమాజ్‌వాదీ పార్టీ, సీపీఐ, సీపీఎం, ఎన్సీపీ(ఎస్పీ) శివసేన(యూబీటీ) తదితర పార్టీల నేతలు సమావేశానికి హాజరు కానున్నారు.

# నేడు సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి

### భారీ ర్యాలీ, బహిరంగ సభకు ఏర్పాట్లు

### పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు (బుధవారం) సిరిసిల్లలో పర్యటించ నున్నారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి సిరిసిల్లకు వస్తున్న రేవంత్‌కు ఘన స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధమవు తుండగా, అధికార యంత్రాంగం సైతం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కరీంనగర్‌లో కలె క్టరేట్ భవన సముదాయాన్ని సీఎం ప్రారం భించనున్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిం చనున్నారు. సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ నుంచి హెలికా ప్టర్ ద్వారా సిరిసిల్ల చేరు కుని, అంబేడ్కర్ చౌరస్తా నుంచి సభా ప్రాంగణం వరకు నిర్వహించే ర్యాలీలో పాల్గొంటారు. రగుడు కలెక్టరేట్ చౌరస్తా సమీ పంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభా ప్రాంగణంలోనే రూ.345. 78 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు.

### కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులుగా

## సామ రామ్మోహన్‌రెడ్డి,రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి



**న్యూఢిల్లీ :** రాష్ట్రంలో వచ్చే ఏడాది మార్చిలో ఖాళీ కానున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు అధికార కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేసిం ది. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానానికి సామ రామ్మోహన్‌రెడ్డిని, వరంగల్–ఖమ్మం–నల్లగొండ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమో దంతో ఇద్దరు అభ్యర్థుల పేర్లను ఖరారు చేసినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కాగా, సామరామ్మో హన్‌రెడ్డి సుదీర్ఘ కాలంగా టీపీసీసీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. సర్వోత్తమ్‌రెడ్డి దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తనయుడు.

# ఏడాదిలోపే ఇందిరమ్మ ఇళ్ల తాళాలు అందిస్తాం

### పేదోడి సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం




2లో..

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదవాడి కష్టం తెలిసిన ఇందిరమ్మ ప్రభుత్వమని, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదవాడు తన జీవితకాలంలో ఒక్కసారైనా సొంత ఇంటిని చూసుకోవా లన్న ఆకాంక్షను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్యూఆర్/కోర్ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల భూములను గుర్తించి, వాటిని హౌసింగ్ శాఖకు బదలాయించి పేదల కోసం గ్రౌండ్ ప్లస్ టెన్ అంతస్తుల అపార్ట్‌మెంట్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాంపల్లి శాసనసభ నియోజకవర్గంలోని రెడ్ హిల్స్‌లో మంగళవారం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు.**

# 'కల్కి భగవాన్' అస్తమయం

### అనారోగ్యంతో చెన్నై ఆస్పత్రిలో తుదిశ్వాస

### 'ఏకం' ఆధ్యాత్మిక సంస్థ వ్యవస్థాపకుడు



**సత్యవేడు, సెప్టెంబరు 29 :** కల్కి భగవాన్‌గా ప్రసిద్ధి చెందిన విజయకుమార్ నాయుడు (77) అనారోగ్యంతో కన్నుమూశారు. చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. ఆధ్యాత్మిక గురువుగా ప్రసిద్ధి చెందిన ఆయన తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలోని బత్తలవల్లం కేంద్రంగా 'ఏకం' సంస్థను స్థాపించి, ఆధ్యాత్మిక సాధన, మానవతా విలువలు, సేవాభా వంపై భక్తులకు మార్గదర్శనం చేశారు. ఆయన మృతి వార్తతో భక్తులు, శిష్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. భక్తుల దర్శనార్థం ఆయన భౌతిక దేహాన్ని ఏకం క్షేత్రంలో ఉంచనున్నట్లు సమాచారం. 1949లో తమిళనాడులో జన్మించిన విజయకుమార్ చెన్నైలో చదువుకు న్నారు. 1977 జూన్ 9న పద్మావతిని వివాహం చేసుకున్నారు. ఆ తరువాత ఆధ్యాత్మిక, ప్రత్యామ్నాయ విద్యవైపు అడుగులు వేశారు. 1980వ దశకం మధ్యలో చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం రామ కుప్పం మండలం రాజుపేట సమీపంలో జీవాశ్రమం పేరుతో రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభించారు. విద్యార్థుల వికాసం, ఆత్మ పరిశీలనపై దృష్టిపెట్టే విధంగా ఈ సంస్థను తీర్చిదిద్దారు. అనంతరం ఈ ప్రాజెక్ట్‌ను ఆధ్యాత్మిక కార్యకలాపాలకు కేంద్రంగా 'సత్యలోకం'గా పేరు మార్చారు. 1990వ దశకం చివర్లో విజయకుమార్ తనను కల్కి అవతారంగా భావించే ఆధ్యాత్మిక ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆయన భార్య పద్మావతి అమ్మ భగవాన్ పేరుతో అనుచరులకు పరిచయమయ్యారు.

### నేడే భారత్, వెస్టిండీస్

# రెండో వన్డే

### మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో




**గువాహటి:** సొంతగడ్డపై వెస్టిం డీస్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భాగంగా ఇప్పటికే తొలి మ్యాచ్ గెలుచుకున్న భారత జట్టు.. బుధవారం గువాహటిలో రెండో వన్డే ఆడనుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 1–0 ఆధిక్యం లో ఉన్న శుభ్‌మన్ గిల్ సేన.. బర్సపర స్టేడియంలోనే సిరీస్‌ను పట్టేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నది . భారీ స్కోర్లు నమో దయ్యే బర్సపరలో తొలి వన్డేలో మాదిరిగానే కోహ్లీ, గిల్, రోహిత్ చెలరేగాలని టీమిండియా ఆశిస్తు న్నది. 2018లో ఇక్కడ వెస్టిండీస్ తోనే జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి నిర్దేశించిన 322 పరుగుల ఛేదన లో భాగంగా రోహిత్, కోహ్లీ శత కాలతో భారీ విజయాన్ని అందుకుంది. మరి నేటి మ్యాచ్‌లో 'రోకో' ఎలా చెలరేగుతారో చూడాలి.

# అవినీతికి పాల్పడిన పూర్వ డీపీఆర్ఓ

### అక్రిడేషన్ కార్డుల అవకతవకలపై

### అక్రిడేషన్ కమిటీ కలెక్టర్‌కు ఫిర్యాదు

### విచారణకు ఆదేశాలిచ్చిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్



4లో..

తెలంగాణ జీవగడ్డ



# ఏడాదిలోపే ఇందిరమ్మ ఇళ్ల తాళాలు అందిస్తాం

## పేదోడి సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**జనోదయ, హైదరాబాద్, సెప్టెంబర్ 29:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదవాడి కష్టం తెలిసిన ఇందిరమ్మ ప్రభుత్వమని, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదవాడు తన జీవితకాలంలో ఒక్కసారైనా సొంత ఇంటిని చూసుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్యూఆర్/కోర్ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల భూములను గుర్తించి, వాటిని హౌసింగ్ శాఖకు బదలాయించి పేదల కోసం గ్రౌండ్ ప్లస్ టెన్ అంతస్తుల అపార్ట్‌మెంట్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాంపల్లి శాసనసభ నియోజకవర్గంలోని రెడ్ హిల్స్ లో మంగళవారం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి సహచర మంత్రి అజారుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహానగరం లో ఒక్కో ఎకరం భూమి విలువ రూ.200 కోట్లు, రూ.250 కోట్లు ఉన్నా.. ఆ భూమి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం కంటే పేద కుటుంబానికి ఒక సొంత ఇల్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు.

**పారదర్శకంగా**

**డ్రా పద్ధతిలో ఇండ్ల కేటాయింపు**

మంగళవారం పారదర్శకంగా నిర్వహించిన డ్రాలో 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, మిగిలిన వారికి రెండో, మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు అందిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలోని మొత్తం 20 నియో జకవర్గాల్లో భూములను గుర్తించామని, సుమారు 16--17 ప్రాంతాల్లో టెండర్ ప్రక్రియ పూర్త యిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

**ఏడాదిలోపే**

**ఇంటి తాళాలు**

ప్రస్తుతం నిర్మిస్తున్న ఒక్కో అపార్ట్‌మెంట్ విలువ సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందని మంత్రి తెలిపారు. రెండు, మూడు సంవత్సరాల సమయం తీసుకోకుండా ఒక ఏడాదిలోపే నిర్మాణాలు పూర్తి చేసి, ఇదే వేదిక నుంచి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందిస్తా నని హామీ ఇచ్చారు. గతంలో మాదిరిగా కేవలం సర్టిఫికెట్లు ఇచ్చి వదిలేయకుండా.. అవసరమైతే పిల్లల చదువులు, వివాహాలు వంటి కుటుంబ అవసరాల కోసం రుణం పొందే అవకాశం ఉండేలా ఇళ్లను రూపాయి కమిషన్ లేకుండా, రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా నేరుగా లబ్ధిదారుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**డ్రైనేజీ సమస్యకు**

**శాశ్వత పరిష్కారం**

టవర్స్‌లో నివసించే కుటుంబాలకు డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. నిర్మాణ ప్రాంతంలోని డ్రైనేజీని మెయిన్ ట్రంక్ లైన్‌కు అనుసంధానం చేసే బాధ్యతను హౌసింగ్ శాఖ తీసుకుంటుందని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల భాగస్వామ్యాన్ని కూడా నిర్ధారిస్తామని చెప్పారు. వారానికి ఒక రోజు లబ్ధిదారులకు నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించే అవకాశం కల్పించి, తమ ఇల్లు నాణ్యతతో నిర్మిస్తున్నారా లేదా అన్నది స్వయంగా పరిశీలించుకునే అవకాశం ఇస్తామని మంత్రి తెలిపారు.

**నగరానికి దూరంగా**

**ఇళ్లు కట్టి పేదలను ఇబ్బంది పెట్టం**

గత ప్రభుత్వాలు నగరంలో పేదలు నివసించే ప్రాంతాలకు 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించడం వల్ల జీవనోపాధి కోసం వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. పేదల జీవనోపాధి, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇళ్ల నిర్మాణ ప్రాంతాలను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇల్లు. ప్రతి తండాలో, ప్రతి గూడెంలో, ప్రతి డివిజన్‌లో, ప్రతి వార్డులో పేదలకు ఇళ్లు నిర్మించి చూపిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన ఇళ్ల నిర్మాణం కంటే ప్రజా ప్రభుత్వం తొలి విడతలోనే రెట్టింపు ఇళ్లు నిర్మించి చూపిస్తుందని మంత్రి అన్నారు. పేదల సొంతింటి కలను ఎన్నికల హామీగా కాకుండా, ప్రభుత్వ బాధ్యతగా భావించి అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఎంపికైన 480 మంది లబ్ధిదారులకు మంత్రి అభినందనలు తెలియజేస్తూ, రాబోయే రోజుల్లో రెండో, మూడో, నాలుగో విడతలను ప్రారంభించి, ఎన్నికలలోపు నాలుగు విడతల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో భాగంగా మంత్రి పొంగులేటి లక్కీడ్రాలో విజేతలైన లబ్ధిదారులకు ఇళ్ల నెంబర్ల కేటాయి స్తూ వారి పేర్లను ప్రకటించారు. మంత్రి చేతుల మీదుగా మాదేసు లత అనే మహిళకు డ్రాలో ఇందిరమ్మ ఎ టవర్ లోని 801 ఇంటిని కేటాయిస్తూ ప్రకటన చేశారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎండీ విపి గౌతమ్, కలెక్టర్ ప్రియాంక అలా తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ పట్టాను రద్దుచేసి మా భూమి మాకు ఇప్పించండి

## రైతుల ఆవేదన



**జీవగడ్డ : చెన్నూర్**

చెన్నూరు మండలం కత్తరసాల గ్రామపంచాయతీ సుబ్బరంపల్లి గ్రామపంచాయతీ శివారులో గల రాతిపల్లి మల్లయ్య, రాజయ్య మరియు రాములు అనే రైతులమైన మేము సర్వే నెంబరు 54 గాగల భూమిని 1979లో మేము పట్టాదారు దగ్గర నుంచి కొనుగోలు చేసి గత 47 సంవత్సరాలుగా ఈ భూమిని సాగు చేసుకుంటున్నామని కానీ భూమి పక్కన ఉన్నటువంటి ,వీణ వయాజుద్దీన్ తప్పుడు పత్రాలు సృష్టించి అతని పేరుపైన పట్టా చేయించుకోవడం జరిగిందని, ఒక నెల క్రితం మేము ఇట్టి భూమిలో సాగు చేస్తుండగా వీణ వయాజుద్దీన్ అతను సోదరులు మా ఆడవారిపై బెదిరింపులకు వచ్చారని, ఇట్టి భూమిపై మేము మాకు ఉన్న ఆధారాలతో కోర్టు వెళ్ళామని ఈ కేసు కోర్టు విచా రణలో ఉండగా ఆక్రమణదారులు మాపై దాడికి దిగుతున్నారని,దయచేసి సంబంధిత అధికారులు ఊరి గ్రామస్తులను,భూమి చుట్టూ ప్రక్కల హద్దులు గల రైతులను విచారించి, సదరు వ్యక్తి పట్టాను రద్దుచేసి మాభూమి మాకు ఇప్పించాలని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రతి గల్లీలో మెరుగైన రహదారులు

**- అంబులెన్స్‌లు సైతం వెళ్లేలా మౌలిక వసతుల అభివృద్ధి**

**- 13వ డివిజన్ విట్టల్ నగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలించిన మేయర్**



**జీవగడ్డ : గోదావరిఖని, సెప్టెంబర్ 29:**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ విట్టల్ నగర్‌లో సుమారు 20 అడుగుల వెడల్పుతో, దాదాపు 300 మీటర్ల పొడవున నిర్మాణం జరుగుతున్న నూతన సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ చుక్కల లావణ్య శ్రీనివాస్ తో కలిసి మేయర్ మహంకాళి స్వామి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ.. నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. రామగుండం నగరంలో ప్రతి డివిజన్‌లోని ప్రతి గల్లీకి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు సైతం సులభంగా వెళ్లే విధంగా రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కార్పొరే షన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి. ముస్తఫా, నాయకులు తిప్పారపు శ్రీని వాస్, కార్పొరేటర్లు గట్ల రమేష్, ధూళికట్ట సతీష్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు టైలర్ సత్తన్న, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

## జాతీయ రహదారి విస్తరణ పనులను

# పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్చెరు పట్టణంలో**

**భారీ స్వాగత తోరణం**

**యూటర్న్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు**

**సూచనలు**

**జీవగడ్డ : పటాన్చెరు**



మదీనగూడ నుంచి రుద్రారం మీదుగా సంగారెడ్డి వరకు కొనసాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం ఉదయం పరిశీలించారు. జాతీయ రహదారుల సంస్థ అధికారులతో కలిసి పటాన్చెరు పట్టణ పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ కేంద్రమైన పటాన్చెరు పట్టణం ప్రత్యేకత, చారిత్రక ప్రాధాన్యత, అభివృద్ధి ప్రతిష్టను ప్రతిబింబించేలా అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ స్వాగత తోరణాన్ని నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. పట్టణంలోకి ప్రవేశించే వారికి ఆకర్షణీయంగా ఉండేలా స్వాగత తోరణం నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా స్వాగత తోరణం సమీపంలో యూటర్న్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా ఉంటాయని తెలిపారు. బస్టాండ్ ఎదురుగా ప్రయాణికుల రాకపోకలకు, స్థానిక వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మా ణం చేపట్టనున్నట్లు వెల్లడించారు.

**పనుల్లో జాప్యంపై అసంతృప్తి**

జాతీయ రహదారి విస్తరణ పనులు ఆశించిన వేగంతో కొనసాగకపోవడంపై ఎమ్మెల్యే జిఎంఆర్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. రహదారి విస్తరణతో పటాన్చెరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిర్మాణ పనుల సమయంలో ప్రజలకు, వ్యాపారులకు కనీస ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల సంస్థ ఈఈ శ్రీనివాస్, డిఈ సందీప్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, కుమార్ గౌడ్, శివారెడ్డి, అశోక్, శంకర్, రాజు, రాజన్ సింగ్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యతివ్వాలి

**మౌలికవసతుల ఏర్పాటు తర్వాతే**

**కేంద్రాలు ప్రారంభించాలి**

**ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై**

**అదనపు కలెక్టర్ సమీక్ష**

**జీవగడ్డ : ఖమ్మం**



ఖరీఫ్- 2026 ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యతివ్వాలని ఖమ్మం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ ప్రసాదరావుతో కలిసి సమీక్షించారు. ధాన్యం కొనుగోలుకేంద్రాల ఏర్పాటు, నాణ్యత, రవాణా, నిల్వ, మౌలికవసతులు, రైతులకు సౌకర్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గతానికి భిన్నంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత కొనుగోలు కేంద్రాల నుంచి మార్కెట్ యార్డుల్లోని గోదాములకు గానీ గుర్తించిన ఫంక్షన్ హాళ్లకు గానీ, రైస్ మిల్లుల్లోని ఖాళీప్రదేశాలకు గానీ ధాన్యం తరలించాల్సి ఉంటుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం ముందుగా ప్రభుత్వ నియంత్రణలో ఉంటుందని, బ్యాంకు గ్యారంటీలు చెల్లించి, గతంలో పెండింగులో ఉన్న సీఎంఆర్ బియ్యం డెలివరీ పూర్తిచేసిన రైస్ మిల్లులకే భవిష్యత్తులో ధాన్యం కేటాయింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. రైస్ మిల్లర్ల పాత్ర లేకుండానే ముందుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నందున, ధాన్యం నాణ్యతకు అత్యంత ప్రాధాన్యతివ్వాలని అధికారులను ఆదేశించారు. ఓ రోజులో కొనుగోలుకేంద్రం నుంచి రవాణా చేయ గలిగేటంత పరిమాణంలోనే ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు. రైస్ మిల్లుల మాదిరిగానే ధాన్యం నిల్వ చేసే గోదాములవద్ద కూడా వేయింగ్ యంత్రాలు ఏర్పాటుచేసి, బరువు పరిశీలించిన అనంతరం ధాన్యాన్ని దించుకోవాలని తెలిపారు. ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ ట్రాకర్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ప్రత్యేక యాప్ ద్వారా అన్ని వాహనాల రవాణాను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన 7రకాల సన్నరకం ధాన్యానికే రూ.500 అదనపు ప్రోత్సాహకం అందించనున్నట్లు ఆయన తెలిపారు. గ్రేడ్-'ఏ' ధాన్యానికి క్వింటాకు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,441ధర ఉండగా, గుర్తించిన ఏడు రకాల సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 ప్రోత్సాహకం కలిపి క్వింటాకు రూ.2,961 లభించనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఖరీఫ్ సీజనులో 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలు అక్టోబర్ 1 నుంచి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. నవంబర్ 15 నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమయ్యే అవకాశం ఉందని, డిసెంబర్‌లో ధాన్యం రాక మరింత పెరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి చందన్ కుమార్, డీసీఓ గంగాధర్, డీఎం మల్లికార్జున్, మండల ప్రత్యేకాధికారులు, వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ జీవగడ్డ



# అది దోపిడీనే

## కార్పొరేట్ దవాఖానల్లో అధిక ఔషధ ధరలపై సుప్రీం ఆగ్రహం




### అన్ని మందులపై ఒకేలా 16% మార్జిన్ ఉండాలని సూచన

- తమ మందుల దుకాణాల నుంచే మందులను కొనుగోలు చేయాలనడంపై కేంద్రం దృష్టి సారించాలి
- ఈ విధానం వల్ల సామాన్యుడే నష్టపోతున్నాడు
- రిటైలర్లకు రూ.2,700కే సరఫరా అవుతున్నప్పటికీ ఆ క్యాన్సర్ మందు ఎంఆర్‌పీ రూ.27,000
- కార్పొరేట్ దవాఖానలు ఎవరినీ వదలవు
- మృతదేహాన్ని కూడా బయటకు తీసుకెళ్లనీయవు
- ఫార్మా రంగానికి దీనిపై ఏమాత్రం పట్టింపు లేదు

**కార్పొరేట్ దవాఖానాలు క్యాన్సర్ మందులపై పది రెట్ల అధిక ధరను వసూలు చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇది ప్రజలను దోపిడీ చేయడ మేనని వ్యాఖ్యానించింది. అన్ని మందులపై ఏకరీతిగా 16 శాతం మార్జిన్ ఉండాలని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దవాఖానలు తమ మందుల దుకాణాల నుంచే మందులను కొనుగోలు చేయాలని ఆదేశించడంపై కేంద్రం దృష్టి సారించాల ని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం మంగళవారం సూచించింది.ఈ విధానం వల్ల సామాన్యుడే నష్టపోతున్నాడని పేర్కొంది.**

**రిటైలర్లకు రూ.2,700కే సరఫరా అవుతున్నప్పటికీ ఆ క్యాన్సర్ మందు ఎంఆర్‌పీ రూ.27,000గా నిర్ణయిం చారు. కార్పొరేట్ దవాఖానలు ఎవరినీ వదలవు. కనీసం మృతదేహాన్ని కూడా బయటకు తీసుకెళ్లనీయవు. ఫార్మా రంగానికి దీనిపై ఏమాత్రం పట్టింపు లేదు అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రైవేట్ ఆరోగ్య సంరక్షణ సంస్థలు సేవా ప్రదాతల్లా కాకుండా లాభాపే క్షతో నడిచే పరిశ్రమ ల్లాగా పనిచేస్తున్నట్టు కనిపిస్తు న్నాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యా నించింది.డ్రగ్స్(ధరల నియంత్రణ ఉత్తర్వు (డీపీసీఓ), 2013 కింద మందుల ధరల నియంత్రణ, జెనరిక్ ప్రిస్క్రిప్షన్లు, వైద్య పరికరా లపై నియంత్రణలకు సంబంధిం చిన పిటిషన్లను విచారణ జరుపు తున్న ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. రోగులు తరచూ దవాఖాన ఫార్మసీల నుంచి అధిక ధరలకు మందులు ఎందు కు కొనవలసి వస్తున్నదని ధర్మాస నం ప్రశ్నించింది. కార్పొరేట్ దవాఖానల్లో చేరిన రోగులను కొన్నిసార్లు అక్కడి ఫార్మసీ నుంచే మందులు కొనుగోలు చేయమ ని ఒత్తిడి చేస్తారని కోర్టు తెలిపింది.**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: కార్పొరేట్ దవాఖానాలు క్యాన్సర్ మందులపై పది రెట్ల అధిక ధరను వసూలు చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇది ప్రజలను దోపిడీ చేయడమేనని వ్యాఖ్యానించింది. అన్ని మందులపై ఏకరీతిగా 16 శాతం మార్జిన్ ఉండాలని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దవాఖానలు తమ మందుల దుకాణాల నుంచే మందులను కొనుగోలు చేయాలని ఆదేశించడంపై కేంద్రం దృష్టి సారించాలని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం మంగళవారం సూచించింది.ఈ విధానం వల్ల సామాన్యుడే నష్టపోతున్నాడని పేర్కొంది. ఇది పూర్తిగా దోపిడీ. రిటైలర్లకు రూ.2,700కే సరఫరా అవుతున్నప్పటికీ ఆ క్యాన్సర్ మందు ఎంఆర్‌పీ రూ.27,000గా నిర్ణయించారు. కార్పొరేట్ దవాఖానలు ఎవరినీ వదలవు. కనీసం మృత దేహాన్ని కూడా బయటకు తీసుకెళ్లనీయవు. ఫార్మా రంగానికి దీనిపై ఏమాత్రం పట్టింపు లేదు అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రైవేట్ ఆరోగ్య సంరక్షణ సంస్థలు సేవా ప్రదాతల్లా కాకుండా లాభాపేక్షతో నడిచే పరిశ్రమల్లాగా పనిచేస్తున్నట్టు కనిపిస్తున్నాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.డ్రగ్స్(ధరల నియంత్రణ ఉత్తర్వు(డీపీసీఓ), 2013 కింద మందుల ధరల నియంత్రణ, జెనరిక్ ప్రిస్క్రిప్షన్లు, వైద్య పరికరాలపై నియంత్రణలకు సంబంధించిన పిటిషన్లను విచారణ జరుపుతున్న ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. రోగులు తరచూ దవాఖాన ఫార్మసీల నుంచి అధిక ధరలకు మందులు ఎందుకు కొనవలసి వస్తున్నదని ధర్మాసనం ప్రశ్నించింది. కార్పొరేట్ దవాఖానల్లో చేరిన రోగులను కొన్నిసార్లు అక్కడి ఫార్మసీ నుంచే మందులు కొనుగోలు చేయమని ఒత్తిడి చేస్తారని కోర్టు తెలిపింది. బయట కొనుగోలు చేసిన మందులు తెచ్చిన వారికి దవాఖాన నుంచి చికిత్సకు సంబంధించిన హామీ లభించడం లేదని ఆరోపణలు ఉన్నట్లు కోర్టు పేర్కొంది. ఒక క్యాన్సర్ మందు విషయంలో కోర్టు గత వారం చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ విచారణ జరిగింది.ముఖ్యంగా ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ పథకాల పరిధిలోకి వచ్చే రోగుల విషయంలో ఉన్న భారీ వ్యత్యాసాన్ని ధర్మాసనం మరోసారి నొక్కిచెప్పింది. ప్రభుత్వ పథకం కింద ఉన్న రోగిని అధిక ధర చెల్లించేలా చేస్తే దవాఖానకు ప్రభుత్వ నిధుల నుంచి తిరిగి చెల్లింపులు జరుగుతాయి. కాబట్టి, అంతిమంగా ఆ భారాన్ని పన్ను చెల్లింపుదారుడే మోయాల్సి వస్తుందని కోర్టు పేర్కొంది.

### ఏకరీతి మార్జిన్ ఎందుకు లేదు?



కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ సమస్యను అంగీకరిస్తూ ప్రభుత్వం వివిధ ఆందోళనల మధ్య సమతుల్యతను సాధించాల్సి ఉంటుందని అన్నారు. ప్రభుత్వ అధికారులతో ఈ విషయమై చర్చించి ఒక ప్రతిస్పందనను రూపొందించడానికి ఆయన కొద్దిసేపు వాయిదా కోరారు. అవసరమైన, అత్యవసరం కాని మందులకు సంబంధించిన నిబంధనల్లో ఎందుకు వ్యత్యాసం ఉందని ప్రశ్నించిన ధర్మాసనం అన్ని మందులకూ 16 శాతం ఏకరీతి మార్జిన్‌ను వర్తింపచేయవచ్చా అని అడిగింది. పెంచిన ఎంఆర్‌పీ వల్ల తలెత్తే మరో సమస్యను కూడా కోర్టు ప్రస్తావిం చింది. నిజమైన మందుల దుకాణదారుడు అదే మందును చాలా తక్కువ ధరకు అంది స్తున్నప్పటికీ రోగులకు అనుమానం కలగవచ్చని కోర్టు పేర్కొంది.రూ.27 వేల ఎంఆర్‌పీ మందును కెమిస్ట్ రూ.3 వేలకే విక్రయించే ఉదాహరణను ధర్మాసనం ప్రస్తావించింది. తక్కువ ధరకు లభించే ఈ మందు నకిలీది లేదా కల్తీది అయి ఉండవచ్చని రోగి అను మానించే అవకాశం ఉందని కోర్టు పేర్కొంది. తయారీ లేదా రిటైలర్ ధర, ఎంఆర్‌పీ మధ్య ఉన్న భారీ వ్యత్యాసం చివరకు ఎక్కడకు వెళుతున్నదని కూడా న్యాయస్థానం ప్రశ్నించింది. ఇటువంటి ధరల వ్యత్యాసాల వల్ల ఔషధ తయారీదారులు ఎల్లప్పుడూ ప్రధాన లబ్ధిదారులుగా ఉండరని, లాభాల మార్జిన్లలో గణనీయభాగాన్ని ప్రైవేట్ దవాఖానలు పొందవచ్చని సొలిసిటర్ జనరల్ అన్నారు. ఈ ఆర్థిక భారం చివరకు రోగులు, పన్ను చెల్లింపుదారులపైనే పడుతుందని ధర్మాసనం పేర్కొంది. కార్పొరేట్ దవాఖానలు పరిశ్రమలుగా మారాయి. సామాన్యుడు ఇదంతా ఎందుకు భరించాలి? అని ధర్మాసనం ప్రశ్నించింది.

# మోడీ.. గద్దె దిగు



- సీఈసీ జ్ఞానేశ్, అమిత్ షా కూడా తప్పుకోవాలి..
- సర్‌ను తక్షణమే నిలిపివేయాలి
- తొలగించిన 13 కోట్ల పేర్లను తిరిగి చేర్చాలి

**కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం**

**ఓట్ల చోరీకి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ను తక్షణమే నిలిపివేయాలని కోరింది. ఈ ప్రక్రియలో తొలగించిన 13 కోట్ల 30 లక్షల మంది పేర్లను తిరిగి జాబితాల్లో చేర్చాలని తీర్మానించింది. మంగళవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సీడబ్ల్యూసీ సమావేశమైంది. సీపీపీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్య దర్శులు ప్రియాంకాగాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సీనియర్ నేతలు పి.చిదంబరం, సచిన్ పైలట్, ముకుల్ వాస్నిక్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి (తెలంగాణ), డీకే శివకుమార్(కర్ణాటక), వీడీ సతీశన్(కేరళ), సుఖ్వీందర్ సింగ్ సుఖు(హిమాచల్ ప్రదేశ్) పాల్గొన్నారు.**

**నాడు నోట్ల రద్దు.. నేడు ఓట్ల రద్దు**

**జెన్‌జీని ఓటుకు దూరం చేసేందుకే ఫామ్-6లో ఏకపక్షంగా మార్పులు: మల్లికార్జున ఖర్గే**

**ఈవీఎం, ఓటరు జాబితా రెండూ ట్యాంపరింగే 2024 లోకసభ ఎన్నికలు ఫిక్స్ అయ్యాయి**

**నిరసనలతో ఆగం... ప్రతిఘటనలే: రాహుల్**

**దేశంలో రెండు రకాల మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతోందన్నారు. ఈవీఎంలలో, ఓటరు జాబితాల్లో ఉద్దేశపూర్వక ట్యాంపరింగ్ చేస్తున్నారన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలు పూర్తిగా ఫిక్స్ అయ్యా యని ఆయన అన్నట్లు తెలిసింది. సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు రక్షణ కల్పిస్తూ 2023 డిసెంబరులో చేసిన చట్టం కూడా రాజ్యాంగ విరుద్ధం అని ఆయన అన్నట్లు సమాచారం. హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల అక్రమాలను కాంగ్రెస్ లేవనెత్తినపుడు చాలామంది నమ్మలేదని రాహుల్ గుర్తు చేశారు.**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29 :** ఓట్ల చోరీకి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ను తక్షణమే నిలిపివేయాలని కోరింది. ఈ ప్రక్రియలో తొలగించిన 13 కోట్ల 30 లక్షల మంది పేర్లను తిరిగి జాబితాల్లో చేర్చాలని తీర్మానించింది. మంగళవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సీడబ్ల్యూసీ సమావేశమైంది. సమావేశం దాదాపు రెండున్నర గంటలు సాగింది. సీపీపీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శులు ప్రియాంకాగాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సీనియర్ నేతలు పి.చిదంబరం, సచిన్ పైలట్, ముకుల్ వాస్నిక్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి (తెలంగాణ), డీకే శివకుమార్(కర్ణాటక), వీడీ సతీశన్(కేరళ), సుఖ్వీందర్ సింగ్ సుఖు(హిమాచల్ ప్రదేశ్) పాల్గొన్నారు. తెలంగాణ నుంచి సీడబ్ల్యూసీ సభ్యుడు, మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ నుంచి రఘువీరారెడ్డి పాల్గొన్నారు. మొత్తం 68 మంది సభ్యులు సమావేశానికి వచ్చారు. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగడం లేదని జైరాంరమేశ్ విలేకరులతో అన్నారు. వేణుగోపాల్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సంఘానికి, ప్రధాని–హోంమంత్రిలతో మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం(ఈసీఐ) ఒక్క వ్యక్తి నియంత్రణలో నడిచే సంస్థగా మారిపోయిందని సీడబ్ల్యూసీ తీర్మానం ఆరోపించింది. తోటి కమిషనర్లను సంప్రదించకుండానే సీఈసీ నిర్ణయాలు తీసుకుంటున్నారన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొంది. ఫారం–6 నిబంధనల్లో కమిషన్ అనుమతి లేకుండా, చట్ట విరుద్ధంగా మార్పులు చేసిందని తప్పుబట్టింది. "ఈ ఓట్ల చోరీని ప్రధాని, హోంమంత్రి తరఫున సీఈసీయే దగ్గరుండి నడిపించారు. వారి ముగ్గురి రాజీనామా మినహా మరేదీ మన ప్రజాస్వామ్యాన్ని కాపాడలేదు" అని తీర్మానం స్పష్టం చేసింది. దోషులకు శిక్ష పడే వరకు పోరాటం కొనసాగిస్తామని, ఈ పోరాటం పార్లమెంటులో, న్యాయస్థానాల్లో, వీధుల్లో సాగుతుందని ప్రకటించింది. ఓటు హక్కును కాపాడుకోవడం కోసం జరుగుతున్న ఈ పోరాటం స్వాతంత్ర్య పోరాటంతో సమానమని అభివర్ణించింది.

### ఓట్ల రద్దు ఒక కుట్ర: ఖర్గే

వర్కింగ్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రారంభోపన్యాసం చేశారు. పదేళ్ల క్రితం ప్రధాని మోదీ పెద్ద నోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశారని, ఇప్పుడు ఓట్ల రద్దుతో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఓటర్ జాబితాల రక్షకుడైన ఎన్నికల సంఘమే భక్షకుడిగా మారిందని అన్నారు. సొంత సహచరులే నమ్మని సీఈసీ జ్ఞానేశ్‌ను దేశం ఎలా నమ్ముతుంది? అని ఖర్గే ప్రశ్నించారు. మోదీ ఒత్తిడితోనే సీఈసీ ఇలా వ్యవహరించారని, అందువల్ల ప్రధాని నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 1988 డిసెంబరులో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు అధికారం ఇచ్చారని ఖర్గే గుర్తు చేశారు. మోదీ మాత్రం జెన్‌జీ యువతపై కక్షతో ఫారం–6 నిబంధనలను గుట్టు చప్పుడు కాకుండా మార్చారని ఆరోపించారు. ఇలా పథకం ప్రకారం యువతను, పేదలను, దళితులను ఓటుకు దూరం చేస్తున్నారని అన్నారు. త్వరలో ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయని ఖర్గే గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఏ ఓటరూ హక్కు కోల్పోకుండా చూడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

### రెండు రకాల మ్యాచ్ ఫిక్సింగ్ : రాహుల్

సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, దేశంలో రెండు రకాల మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతోందన్నారు. ఈవీఎంలలో, ఓటరు జాబితాల్లో ఉద్దేశపూర్వక ట్యాంపరింగ్ చేస్తున్నారన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలు పూర్తిగా ఫిక్స్ అయ్యాయని ఆయన అన్నట్లు తెలిసింది. సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు రక్షణ కల్పిస్తూ 2023 డిసెంబరులో చేసిన చట్టం కూడా రాజ్యాంగ విరుద్ధం అని ఆయన అన్నట్లు సమాచారం. హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల అక్రమాలను కాంగ్రెస్ లేవనెత్తినపుడు చాలామంది నమ్మలేదని రాహుల్ గుర్తు చేశారు. వాస్తవాల ఆధారంగా పార్టీ ఇచ్చిన ప్రజెంటేషన్లతో రెండేళ్లలో వాతావరణం మారిందన్నారు. ఇప్పుడు ఈసీ వ్యవహారాలు బయట పడుతున్నాయంటే అది కాంగ్రెస్ పోరాట ఫలితమేనని చెప్పారు. ఎన్నికల సంఘం అవకతవకలపై పోరాటంలో కాంగ్రెస్ ఒంటరి పోరాటానికి సిద్ధంగా ఉందని పార్టీ ముఖ్యనేత ప్రియాంకగాంధీ అన్నారు. దీనికోసం కాంగ్రెస్ ఎవరిపైనా ఆధారపడదని చెప్పారు. ఈ అంశాన్ని మొదటి నుంచీ కాంగ్రెసే లేవనెత్తుతోందని, ఒంటరిగానైనా పోరాడే సత్తా తమకు ఉందని అన్నారు. జ్ఞానేశ్ మొండిగా ఉంటారని, రాజీనామా చేయరని ఓ సభ్యుడు వ్యాఖ్యానించగా, "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయలేదా? రాజీనామా చేసే వరకు వీధుల్లో ఆందోళన కొనసాగిస్తాం" అన్నారు. జ్ఞానేశ్‌కు ఒక్కరోజు కూడా సీఈసీగా కొనసాగే నైతిక హక్కు లేదని కేసీ వేణుగోపాల్ అన్నారు. ఆయన ఒక పనిముట్టు మాత్రమేనని, నియంతలు ప్రజల విశ్వాసం కోల్పోయినపుడు అధికారంలో కొనసాగేందుకు ఇలాంటి సాధనాలను వాడుకుంటారని వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ కానీ, సీఈసీ చర్యలు కానీ ప్రధాని, హోంమంత్రి అంగీకారం లేకుండా జరగేవి కావన్నారు.

తెలంగాణ జీవగడ్డ



# దసరా నాటికి

# డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పనులు పూర్తి చేయాలి

**- లబ్ధిదారులకు త్వరలోనే సొంతింటి తాళాలు అందిస్తాం**

**- రామగుండం మేయర్ మహంకాళి స్వామి**



**జీవగడ్డ : గోదావరిఖని, సెప్టెంబర్ 29:**

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు రామగుండం నగరపాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి మంగళవారం ఉదయం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడిన మేయర్, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ఇళ్లను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులతో మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ.. రానున్న దసరా పండుగ నాటికి డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేయించి, అర్హులైన లబ్ధి దారులందరికీ ఇంటి తాళాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లబ్ధిదారుల సొంతింటి కలను సాకారం చేయడంపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రత్యేక దృష్టి సారించారని, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని ఆదేశిస్తున్నారని మేయర్ తెలిపారు. "త్వరలోనే డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారులందరూ తమ నూతన సొంతింటిలోకి అడుగుపెట్టేలా చర్యలు తీసుకుంటాం. దసరా పండుగను సొంతింటి సంతోషంతో జరుపుకునేలా పనులను పూర్తి చేయడానికి కృషి చేస్తు న్నాం" అని మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం మునిసిపల్ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండీ. ముస్తఫా, నాయకులు తిప్పారపు శ్రీనివాస్, కార్పొరేటర్లు వెంగల బాపు, గట్ల రమేష్, ధూళికట్ట సతీష్ పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలి

**సీఎమ్ఓ డాక్టర్ శైలజా మూర్తి**

**తార్నాక ఆస్పత్రిలో ఘనంగా 'వరల్డ్ హార్ట్ డే'**




**జీవగడ్డ : తార్నాక**

ప్రపంచ గుండె ( 'వరల్డ్ హార్ట్ డే') దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమకాలీన సమాజంలో మారుతున్న జీవనశైలి, విపరీతమైన ఒత్తిడి వల్ల పెరుగుతున్న గుండె సంబంధిత సమస్యలపై ప్రజలకు, రోగులకు సమగ్ర అవగాహన కల్పించడమే లక్ష్యంగా సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ అండ్ సీఎమ్ఓ డాక్టర్ శైలజా మూర్తి మాట్లాడుతూ...సమాజంలో గుండె ఆరోగ్య ప్రాముఖ్యతను వివరించడం, ప్రతి ఒక్కరినీ ఆరోగ్యవంతమైన జీవనవిధానం వైపు మళ్లించడమే ఈ అవగాహన కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. ప్రతి ఏటా ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రి తరపున ప్రజల్లో చైతన్యం నింపేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. మారుతున్న జీవనశైలిలో గుండె సంరక్షణ అనేది కేవలం చికిత్సకే పరిమితం కాకూడదని, నివారణే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగాలని డాక్టర్ శైలజా మూర్తి పిలుపునిచ్చారు. తమ ఆస్పత్రిలో అన్ని వర్గాల వారికి నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. గుండె జబ్బులను ముందస్తుగా నివారించే మార్గాలు,వ్యాధి బారిన పడితే అందుబాటులో ఉన్న అధునాతన చికిత్సలపై ఆమె వివరించారు.ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు నడక లేదా యోగా చేయడం, నూనె, ఉప్పు, మసాలా పదార్థాలను తగ్గించి సమతులాహారం తీసుకోవడం, మద్యం,పొగతాగడం వంటి అలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా గుండెను సురక్షితంగా ఉంచుకోవచ్చని వివరించారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ అడ్మిన్ డాక్టర్ శ్రీనివాస్, కార్డియాలజిస్టులు డాక్టర్ రేణుక, డాక్టర్ రామ్మోహన్, పలువురు వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అవినీతికి పాల్పడిన పూర్వ డీపీఆర్ఓ అయూబ్ ఖాన్

**అక్రిడేషన్ కార్డుల అవకతవకలపై అక్రిడేషన్ కమిటీ కలెక్టర్‌కు ఫిర్యాదు**

**విచారణకు ఆదేశాలిచ్చిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్**



**జీవగడ్డ , హనుమకొండ, సెప్టెంబర్ 29:**

హన్మకొండలో సమాచార, ప్రజా సంబంధాల శాఖాధికారిగా పనిచేసి ప్రస్తుతం వరంగల్ నగర పాలక సంస్థలో ప్రజా సంబంధాల అధికారిగా పనిచేస్తున్న అయూబ్ ఖాన్‌పై విచారణకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. విచారణ అధికారిగా జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాస్‌ను కలెక్టర్ నియమించారు. 2026-2028 సంవత్సరానికి గాను జర్నలిస్ట్‌ల అక్రిడిటేషన్ కార్డుల జారీలో డిపిఆర్ఓ అయూబ్ ఖాన్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని తెలుపుతూ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్‌కి మంగళవారం లిఖిత పూర్వ కంగా పిర్యాదు చేశారు. పది మందితో కూడిన అక్రిడిటేషన్ కమిటీ రెండు దఫాలుగా సమావేశమై ప్రతీ జర్నలిస్ట్ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించడమైనది. అర్హులైన జర్నలిస్ట్‌ను గుర్తిస్తూ అర్హత లేని జర్నలిస్ట్‌ను పెండింగ్‌లో పెడుతూ తీర్మానం చేయడం జరిగింది. అయినప్పటికీ అక్రిడిటేషన్ కమిటీ సిఫారస్‌ను పక్కన పెట్టడంతో పాటు,కలెక్టర్‌ను తప్పుదోవపట్టించి డీపిఆర్ఓ ఇష్టానుసారంగా కార్డులు మంజూరి చేశారు. రాజకీయ పార్టీల నాయకుల వద్ద పనిచేసే వారికి, రియల్ టర్లకు, జర్నలిస్ట్ కుటుంబ సభ్యులకు కార్డులు జారీ చేశారు. డి పి ఆర్ ఓ అయూబ్ సమక్షంలో జరిగిన రెండు అక్రిడిటేషన్ కమిటీ సమావేశాల జాబితాను సభ్యులకు ఇవ్వట్లేదని తెలుపుతూ కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం జరిగింది. పది మందితో కూడిన అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు గాడిపల్లి మధు, బీఆర్ లెనిన్, గడ్డం కేశవమూర్తి, మస్కపురి సుధాకర్, కంకణాల సంతోష్, బోల్ల అమర్, గోకారపు శ్యాం, వల్లాల జగన్, ఎన్. బుచ్చిరెడ్డి, నయీమ్ కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే డిఆర్ఓ శ్రీనివాసును విచారణ అధికారిగా నియమించారు. గత జాబితా నుంచి అనర్హులను తొలగించి, వర్కింగ్ జర్నలిస్టులందరికీ న్యాయం చేయాలని సభ్యులు కలెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు.

# వెట్‌ల్యాండ్స్, అటవీభూముల పరిరక్షణకు చర్యలు

**సమన్వయంతో అటవీ ఆక్రమణల నియంత్రణ**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్**




**జీవగడ్డ - ఖమ్మం**

వెట్‌ల్యాండ్స్ డీమార్కేషన్, అటవీ భూముల పరిరక్షణకు పటిష్టచర్యలు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీలో వెట్‌ల్యాండ్స్ సరిహద్దుల నిర్ధారణ, అటవీ భూముల పరిరక్షణ, ఆక్రమణల నియంత్రణ, అటవీ భూముల మళ్లింపు, ఆర్ఓఎఫ్ఆర్, శాఖల సమన్వయం వంటి అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లా అటవీఅధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఐటీడీఏ పీఓ రాహుల్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఆయాశాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. వెట్‌ల్యాండ్స్ సరిహద్దుల నిర్ధారణలో కేవలం ఆన్‌లైన్ రికార్డులు, కేఎంఎల్ మ్యాపింగ్ మాత్రమే పరిమితం కాకుండా భౌతిక పరిశీలనతో హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ సూచించారు. డీమార్కేషన్‌లో పాత నీటిపారుదల, రెవెన్యూ రికార్డులు, సర్వేమ్యాపులు సమగ్రంగా పరిశీలించి హద్దులను స్పష్టంగా గుర్తించాలన్నారు. ప్రతి డీమార్కేషన్ సంబంధించి ఫొటోలు, జీపీఎస్ వివరాలు, ఇతర ఆధారాలను భద్రపరచాలని సూచించారు. పూర్తయిన డీమార్కేషన్ పనులు రికార్డులతో మళ్లీ సమీక్షించి, మిగిలిన చోట్ల సరిహద్దుల నిర్ధారణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. కేఎంఎల్ డేటా, కేడస్ట్రల్ మ్యాపులు, రెవెన్యూ రికార్డుల మధ్య వ్యత్యాసాలుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. వీటి పరిధిలో ప్రభుత్వ, నీటిపారుదల శాఖల భూములు, ప్రైవేట్ భూములు, ఏవైనా ఆక్రమణలుంటే వాటిని స్పష్టంగా గుర్తించి ప్రత్యేకంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రికార్డుల్లోని వివరాలను పరస్పరం సమన్వయంతో భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా పూర్తిస్థాయి డాక్యుమెంటేషన్ చేయాలని సూచించారు. అటవీభూముల పరిరక్షణ పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సమీక్షలో స్థానికసంస్థల అదనపుకలెక్టర్ ఎం.విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, భద్రాచలం ఎఫ్‌డీఓ నిషా, కొత్తగూడెం ఆర్డీఓ మధు, తహసీల్దార్లు, అటవీ, రెవెన్యూ, నీటిపారుదల, పోలీస్, విద్యుత్, ఆర్అండ్‌బీ, ఐటీడీఏ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు

**- చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సంకీర్తన**



**జీవగడ్డ : చెన్నూర్**

పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా చెన్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్, కిష్టంపేట సెక్టార్ లోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సి డి పి ఓ సంకీర్తన, సూపర్‌వైజర్ మాధవి హాజరై పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, సమతుల్య ఆహారంపై అవగాహన కల్పించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో కీలకమని, పిల్లలకు రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పాలు, గుడ్లు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వయస్సుకు తగిన ఆహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భధారణ సమయంలో వైద్యుల సూచనలను పాటిస్తూ సమతుల్య ఆహారం తీసుకోవాలని, ఐరన్, కాల్షియం వంటి అవసరమైన పోషకాలు అందేలా ఆహారపు అలవాట్లను మెరుగుపరుచుకోవాలని వివరించారు. ప్రసవానంతరం బాలింతలు కూడా తగినంత పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు శిశువుకు తల్లిపాలను అందించడం ద్వారా బిడ్డ ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తోడ్పడాలని సూచించారు. కిశోర బాలికలు పోషకాహార లోపానికి గురికాకుండా చిన్న వయస్సు నుంచే ఆరోగ్యక రమైన ఆహారపు అలవాట్లను అలవరచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి ఆరోగ్య నియమాలను ప్రతీ ఒక్కరూ పాటించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు అందుతున్న సేవ లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రావుల సునీత, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పోషణ అభియాన్ బి సి నగేష్, ఉమెన్స్ క్లబ్ మెంబెర్స్ విజయ, లిప్సిక, అంగన్వాడీ టీచర్లు , అంగన్వాడీ హెల్పర్స్, పాల్గొన్నారు.

**రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో**

# శ్రీగణపతికి సంకటహార చతుర్థి పూజలు



**జీవగడ్డ : ధర్మపురి :** అంగారక సంకటహార చతుర్థి సందర్భంగా జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం అనుబంధ దేవాలయమైన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో గల శ్రీగణపతికి గణపతి ఉపనిషత్తులతో, మన్య సూక్తంతో అభిషేకం హారతి మంత్రపుష్పం కార్యక్రమంలు అత్యంత వైభవంగా నిర్వహించబడినది. ఈకార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్,సీనియర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి,వేద పండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, ఓంకార శర్మ ,స్థానిక వేదపండితులు మధు రామ శర్మ ,అభిషేకం పురోహితులు బొజ్జా సంతోష్ కుమార్,రాజగోపాల్ అర్చకులు ద్యావల్ల విశ్వనాథ శర్మ ,సాయికుమార్,అదిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



